
ప్రజాశక్తి
శుక్రవారం 12 జులై 2024 | 5 | శ్రీ సత్యసాయి



# ముందుకు సాగని సాగు..!

◆ పదును కోసం ఎదురు చూపులు
◆ ఉమ్మడి జిల్లాలో 13 శాతంలోనే విత్తనం




**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 13 శాతం లోపే విత్తనం పడింది. సాధారణంగా 15.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు రెండు లక్షల ఎకరాల్లోపే విత్తనం పడింది. తక్కిన భూమి అంతా ఇంకా బీడుగానే ఉంది. జూన్‌లో పడిన వర్షాలను చూసి రైతులు ఖరీఫ్ సాగుకు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉన్నారు. విత్తనం వేసుకుందామంటే పదును కాక ఆగిపోయింది. ఇందులో ప్రధాన పంట అయిన వేరుశనగ అనంతపురం జిల్లాలో 4.88 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది విత్తనం పడుతుదని అంచనా వేశారు. ఇప్పటి వరకు విత్తనం పడింది కేవలం 36,590 ఎకరాల్లో మాత్రమే. ఇక సత్యసాయి జిల్లాలో 4.32 లక్షల ఎకరాలకుగానూ 80 వేల ఎకరాల్లోనే వేరుశనగ సాగైంది. కంది పంట అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 50 వేల ఎకరాలకుగానూ 6879 ఎకరాల్లో విత్తనం పడింది. సత్యసాయి జిల్లాలో ఈ పంట 51 వేల ఎకరాలకుగానూ తొమ్మిది వేల ఎకరాల్లోనే విత్తనం పడింది. ఆముదం సాధారణ సాగు 40 వేల ఎకరాలకుగానూ ఏడు వేల ఎకరాల్లో విత్తనం పడింది. సత్యసాయి జిల్లాలో ఎనిమిది వేల ఎకరాలకుగానూ వంద ఎకరాల్లోనే ఆముదం పంట సత్యసాయి జిల్లాలో సాగైంది. ఇలా అన్ని రకాల పంటల సాగు నామమాత్రంగానే ఉంది.

**జులై నెల మొత్తం వర్షాభావమే**

పంటల సాగుకు కీలకమైన జులై నెలలో మొత్తం వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో 32 మండలాలుంటే కేవలం మూడు మండలాల్లోనే వర్షపాతం సాధారణంగా పడింది. విడపనకల్లు, గుత్తి, గుంతకల్లు మండలాలు మినహా తక్కిన అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. జులై నెలలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 19 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా పడినది 7.2 మిల్లీమీటర్లు మాత్రమే. సాధారణంలో 62 శాతం వర్షపాతం లోటుంది. ఇదే పరిస్థితి సత్యసాయి జిల్లాలోనూ నెలకొంది. సరైన పదును అసలైన సమయంలో కాకపోవడంతో ఖరీఫ్ పంటల సాగుపై తీవ్ర ప్రబావం చూపుతోంది.

## పుట్టపర్తిలో తాండవిస్తున్న అపరిశుభ్రత

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

ప్రశాంతతకు పరిశుభ్రతకు నిలయమైన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి అపరిశుభ్రతకు నిలయంగా మారుతోంది. ఎక్కడికక్కడ అపరిశుభ్రత పేరుకుపోవటంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీలోని చిత్రావతి రోడ్డు, సమాధి రోడ్డు, గోపురం రోడ్డు, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పురవీధుల్లో పందులు యథేచ్ఛగా స్వైర విహారం చేస్తున్నాయి. ఏ వీధి చూసిన జనావాస ప్రాంతాల్లో పందులు గుంపులు గుంపులుగా వస్తుండడంతో స్థానికులు, సత్యసాయి భక్తులు ఆందోళన చెందుతున్నారు. పుట్టపర్తి పవిత్రకులు కాపాడాల్సిన మున్సిపల్ అధికారులను చూసి చూడనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రోడ్లపై నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో పందులు ఆవాసాలుగా మార్చుకుంటూ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ విదేశీ భక్తులు తరలివచ్చే ఈ ప్రాంతంలో పారిశుధ్య లోపం కొట్టు వచ్చినట్లు కనిపిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ అధికారుల తీరుపై పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడో ఒకచోట డ్రైనేజీ నీరు లీకేజీ అయి రోడ్లపై నిల్వ ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పురవీధుల్లో పందులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య మెరుగుదలకు కృషి చేయాలని స్థానికులు, సత్యసాయి భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ అంజయ్య వద్ద ప్రస్తావించగా పందుల యజమానులకు నోటీసులు ఇచ్చామని అయినా వస్తున్నాయని అన్నారు. వాటిని పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు.


చెత్తకుప్పలో పందుల స్వైర విహారం




## జిల్లాను అభివృద్ధిలో నడుపుదాం

◆ అందరూ సమిష్టిగా పనిచేస్తే సాధ్యం
◆ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి
◆ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో మంత్రులు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమిష్టిగా పని చేసి జిల్లాను అభివృద్ధిలో నిలుపుదామనిరాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ తెలియజేశారు. గురువారం పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ టిఎస్.చేతన్ అధ్యక్షతన తొలి జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపురం ఎంపి పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్.రాజు, ఎస్పీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం సంబంధిత శాఖల అధికారులు అందరూ సమన్వయం, అంకితభావంతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. ఉచిత ఇసుక విధానం పక్కదారి పట్టకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తెప్పించడానికి తనవంతు కషి చేస్తానని తెలిపారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి సవితమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అభివద్ధి కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో బాధ్యత లేకపోవడంతోనే రాష్ట్రంలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. జిల్లాలో ఇరిగేషన్, పరిశ్రమలు, హార్టికల్చర్ హబ్ లాంటి అనేక అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు విస్తతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలు అన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. ఎంపీగా తాను కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. త్వరలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష సమావేశాల్లో ప్రజాప్రతి నిధులను ఆహ్వానించే విధంగా కార్యక్రమాలు ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జడ్పీ సీఈవో వైఖోమ్ నదియా, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏ తప్పూ చేయకున్నా సస్పెండ్ చేశారు..!

◆ పదేళ్లుగా కదిరిలో పార్టీ క్యాడెర్‌ను ఏకతాటిపైకి తెచ్చా
◆ గెలవలేక నాపై నిందలా..?
◆ వైసిపి మాజీ ఎమ్మెల్యే డా॥పివి.సిద్ధారెడ్డి




**ప్రజాశక్తి-కదిరి అర్బన్**

తానూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకున్నా అనవసరంగా తనను అవమానించి పార్టీ నుంచి సస్పెండ్ చేశారంటూ కదిరి వైసిపి మాజీ ఎమ్మెల్యే డా॥పివి.సిద్ధారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ వైసిపి అధిష్టానం సిద్ధారెడ్డిని బుధవారం నాడు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కదిరిలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. వైసిపి తీసుకున్న నిర్ణయంపై ఆయన బావోద్వేగానికి గురై కన్నీరుకార్చారు. వైసిపికి వ్యతిరేకంగా తానూ ఏ రోజూ ప్రవర్తించలేదన్నారు. కదిరి నియోజకవర్గంలో కుక్కలు చింపిన విస్తరిలా ఉన్న వైసిపిని గత పది సంవత్సరాలుగా తన భుజస్కందాలపై మోశానన్నారు. 2014లో కదిరిలో వైసిపి అభ్యర్థి గెలుపుకోసం పని చేశానన్నారు. గెలిచిన రెండు సంవత్సరాల కాలంలోనే ఆయన పార్టీ ఫిరాయిస్తే పార్టీకి దిక్కులేని సమయంలో తాను కార్యకర్తలకు అండగా ఉండి పని చేశానన్నారు. 2019లో తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రతి గంటా, ప్రతి రోజూ ప్రజలు, కార్యకర్తలకు అండగా నిలిచానని చెప్పారు. ఓ వైపు పార్టీని బలోపేతం చేస్తూనే మరో వైపు కదిరి నియోజవకర్గం అభివృద్ధికి కృషి చేశానన్నారు. హంద్రీనీవా నీటితో నియోజకవర్గంలోని ప్రతి చెరువునూ నింపాలన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్ చుట్టూ తిరిగి టన్నెల్ పనులను పూర్తి చేయించానని తెలిపారు. అప్పటి ప్రభుత్వం రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయన్నారు. అయినా తన సొంత నిధులు ఖర్చు చేసి తలుపుల, నంబులపూలకుంట మండలాలకు నీటిని అందించినట్లు తెలియజేశారు. ఇంతలా పని చేసిన తననూ కావాలనే వైసిపి అధిష్టానం పక్కన బెట్టి తను అవమానించారన్నారు. కనీసం అధికారులు తన ఫోన్ కూడా ఎత్తనీయకుండా కొందరు వైసిపి ముఖ్య నాయకులు చేశారన్నారు. కదిరికి సంబంధం లేని వ్యక్తిని తీసుకొచ్చి 2024 అభ్యర్థిగా ప్రకటించినా తానెప్పుడు ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో కదిరికి వచ్చి కనీసం తనను మాటమాత్రమైనా పలకరించలేదన్నారు. తనను ఎన్ని రకాలుగా అవమానపరిచినా పార్టీ గురించి ఇప్పటి వరకు ఏనాడూ తప్పుగా మాట్లాడలేదన్నారు. ఇంత కాలం పార్టీ అభివృద్ధి కోసం పని చేసి, ఏ తప్పు చేయని తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం అత్యంత అన్యాయం అన్నారు. ప్రస్తుతం పోటీ చేసిన అభ్యర్థి ఓడిపోవాలనుకున్నా వారే ఆయన చుట్టూ ఎక్కువగా ఉన్నారన్నారు. నియోజవకర్గంలో వైసిపి ముఖ్య నాయకులు అని చెప్పుకునే వారి సొంత గ్రామాల్లో కూడా టిడిపికి మెజార్టీ వచ్చిదంటే వారు ఏమాత్రం పని చేశారో అర్థం అవుతోందన్నారు. తాను అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేస్తానన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిన అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తి చేసేందుకు తానూ సహకరిస్తానని చెప్పారు. తన భవిష్యత్తు రాజకీయ నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు, మిత్రులతో చర్చించి త్వరలోనే కార్యచరణ ప్రకటిస్తానన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల కేశవ్


బాధ్యతలు స్వీకరిస్తున్న పయ్యావుల కేశవ్

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాకులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో జవాబుదారీ తనంతో కూడిన పారదర్శకమైన పాలనను రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కషి చేస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన మంత్రి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కలిసి అభినందనలు తెలిపారు.

## శిథిలావస్థలో ఆసుపత్రి భవనాలు

**ప్రజాశక్తి - రొద్దం**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి, ఆసుపత్రి సిబ్బందికి కేటాయించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దాదాపు 25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనాల్లో 15సంవత్సరాల నుండి అధికారులు ఉండక పోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. అదే విధంగా ఆసుపత్రి భవనాన్ని నిర్మించి దాదాపు 30సంవత్సరాలు అయింది. అప్పటి మండల జనాభాను అంచనా వేసి నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం అసౌకర్యంగా ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఆసుపత్రికి నూతన భవనాలను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన భవనం

## కేజీబీవీలో కుళ్లిన కూరగాయలు

**టిడిపి నాయకుల పరిశీలనలో వెల్లడి**
**చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు**


కుళ్లిన కూరగాయలు చూపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారి, నాయకులు

**ప్రజాశక్తి ముదిగుబ్బ**

మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో కుళ్లిన కూరగాయలతో వంట వండి విద్యార్థినులకు వడ్డిస్తుండటంపై స్థానిక టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కెజిబివిలో సమస్యలు తిష్ట వేశాయన్న సమాచారంతో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, తదితరులు గురువారం స్థానిక కెజిబివిని మధ్యాహ్న భోజన సమయంలో పరిశీలించారు, భోజనం, కూరలను పరిశీలించారు. స్టోర్ రూమ్ పరిశీలించగా అక్కడ కూరగాయలు కుళ్ళిపోయి దుర్వాసన వస్తుండడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు ఇలాంటివే పెడతారా అని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని జంతువులు కూడా తినవని అన్నారు. విద్యార్థుల ఆహార విషయంలో ఇలా ప్రవర్తించడం సమంజసం కాదన్నారు. విషయాన్ని టిడిపి ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఇక్కడి విషయాన్ని టిడిపి నాయకులు ఎంఇఒ రమణప్పకు సమాచారం అందించారు. దీంతో ఆయన హుటాహుటిన కెజిబివిని సందర్శించి కుళ్లి, బూజు పట్టిన కాయగూరలను పరిశీలించారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంఇఒ చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాల్ రెడ్డి, మల్లెల నారాయణస్వామి, రంగనాయకులు, నారాయణస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**కెజిబివిని తనిఖీ చేసిన జిసిడిఒ :** మండలం కేంద్రంలోని కెజిబివిని జిసిడిఒ సంపూర్ణ తనిఖీ చేశారు. కుళ్లిన కూరగాయలతో వంట వండుతున్న విషయంపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జిసిడిఒ స్థానిక కెజిబివిని తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఇక్కడి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జిసిడిఒ తెలిపారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ కమిటీ


మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-హిందూపురం**

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ కమిటీ సభ్యులుగురువారం పరిశీలించారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి పరిశీలన చేసే నేషనల్ అక్రిడిటేషన్, అసెస్మెంట్ కౌన్సిల్ (న్యాక్) ఉన్నతస్థాయి కమిటీ గురువారం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను పరిశీలించింది. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని విభాగాలలో అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్, కోకరికులర్, కార్యకలాపాలను పర్యవేక్షించారు. అనంతరం డాక్టర్ ఎస్. ఆరుముగం అధ్యక్షతన డాక్టర్ మానస్ పాండే, డాక్టర్ పద్మలతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ విద్యార్థినులు, పూర్వ విద్యార్థినులు, తల్లిదండ్రులు, కళాశాల అభివద్ధి కమిటీ సభ్యులతో కళాశాలలోని అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్, ఐ.క్యు.ఎ.సి. సమన్వయకర్తలతో పాటు వివిధ విభాగాల అధిపతులు పవర్ పాయింట్ ప్రేజంటేషన్ ద్వారా గత ఐదు సంవత్సరాలుగా జరిగిన కళాశాల అభివృద్ధిని కమిటికి వివరించారు. కళాశాలలోని ప్రయోగశాలలు, గ్రంధాలయం, జిమ్, కార్యాలయం, హాస్టల్ ఇతర వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. సాయంత్రం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను, కరాటే స్టంట్స్, పిరమిడ్స్, యోగా భంగిమలు తిలకించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, కళాశాల కమిషనరేట్ తరఫున ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివాకర్ రెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తరపున అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఇటి.రామ్మూర్తి, సుదర్శన్, అనూష, ఐక్యుఎసి. కో ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేసులు, భోజప్ప, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

## పేట్రేగిపోతున్న మట్టిమాఫియా.!

◆ జెసిబిలు,ట్రాక్టర్లతో యథేచ్ఛగా దోపిడీ ◆ వార్తలు రాసే విలేకరులకూ బెదిరింపులు


చెరువులో జెసిబిలతో ట్రాక్టర్లలోకి మట్టి తోడుతున్న వైనం


ట్రాక్టర్లతో తరలించుకుపోతున్న మట్టి

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

చిలమత్తూరు మండలంలో మట్టి మాఫియా పేట్రేగిపోతున్నారు. కొందరు అక్రమార్కులు మట్టిని తరలిస్తూ దందాకు తెరలేపారు. తాము అదికార పార్టీకి చెందిన వారం అని చెబుతూ ఈ దందాకు పాల్పడుతున్నారు. అయితే మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మాత్రం మట్టిని తరలిస్తున్న వారికీ తమ పార్టీకీ ఎలాంటి సంబంధం లేదని చెబుతుండడం గమనార్హం. మండల పరిధిలోని మరవకొత్తపల్లికి చెందిన ఓ జేసిబి, ఐదు ట్రాక్టర్లతో చిలమత్తూరు చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయం పాత్రికేయుల దృష్టికి రావడంతో గురువారం అక్కడికి వెళ్లి అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. తాము తహశీల్దార్ వద్ద అనుమతి తీసుకున్నాం అని చెప్పుకొచ్చారు. చెరువులో మట్టి తోలడానికి ఇరిగేషన్ అదికారులు అనుమతి ఉండాలి కదా అంటే సమాధానం ఇవ్వలేదు. ఇదే సమయంలో మట్టి తరలింపు ఫొటోలు తీస్తుండగా జేసీబీని దురుసుగా మీ మీద ఎక్కిచేస్తామంటూ బెదిరింపులకు దిగారు. తాము అధికార పార్టీ వాళం ఎవరి వద్ద అనుమతి తీసుకోవల్సిన అవసరం లేదంటూ బెదిరించారు. మట్టి తరలింపుపై వార్త వస్తే మీ అంతు చూస్తామంటూ పదేపదే బెదిరింపులకు దిగారు. అక్కడి నుండి పోలీసు స్టేషన్‌కు చేరుకున్న విలేకర్లు సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు.

**అనుమతులు లేకున్నా లేవుట్‌లకు మట్టి తరలింపు**

చెరువులో మట్టిని తరలించడానికి ఎటువంటి అనుమతులు లేకున్నా కొంత మంది అక్రమదారులు మట్టి తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడితున్నారు. సాధారణంగా రైతులు వారి పొలాలకు మట్టి కావాలంటే ఇరిగేషన్ అదికారులు అనుమతిలు ఇస్తారు. లేఅవుట్ లు, ఇటుక బట్టీలకు ఉచితంగా అనుమతిలు ఇవ్వరు. గతంలో రైతుల పేరిట పొలాలకు అని అనుమతులు పొంది లేఅవుట్‌లకు మట్టిని తరలించేవారు. ఇప్పుడు ఎలాంటి అనుమతి లేకుండానే మట్టిని తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన వారమని ఇటు అదికారులను, అటు పాత్రికేయులని బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని అక్రమట్టి తవ్వకాలను ఆపాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు పొలాలకు మాత్రమే ఉచితంగా అనుమతులు ఉంటాయి. కమర్షియల్‌గా మట్టిని తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఉండవు. ప్రభుత్వం దానిపై ఎలాంటి మార్గనిర్దేశకాలు జారీ చేయలేదు. అలా కాకుండా అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

**యోగానంద్,**
**ఇరిగేషన్ డీఈ .**

# సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు

## మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కందికుంట
## కిరాణా మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ కేంద్రాలు ప్రారంభం


సరుకుల విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత


సరుకుల ధరల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్


వినియోగదారులకు సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

**ప్రజాశక్తి -పెనుకొండ టౌన్**

సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు అందిస్తున్నామని రాష్ట్ర బిసిసంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం వ్యాపార సముదాయం వద్ద రిటైల్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్సిడీపై బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సబ్సిడీపై నాణ్యమైన సరుకులు అందించాలన్న ఉద్దేశంతో శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 4 కేంద్రాలను ప్రారంభించామన్నారు. పేద ప్రజలకు మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నిత్యవసర సరుకులు అందజేస్తామని, ధరలు తగ్గేవరకు ఈకార్యక్రమం కొనసాగుతుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహశీల్దార్ ఉదయ శంకర్ రాజు, సిఎస్‌డిటి ప్రభావతి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** రాష్ట్రంలో పేద ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను అతితక్కువ ధరతో అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని మెయిన్ బజారులో కిరణా మర్చెంట్ అసోషియేషన్ ఆధ్వర్వంలో వినియోగదారుల వ్యవహారాల ఆహారసరఫరా శాఖ వారు అతితక్కువ ధరలతో నాణ్యమైన సరుకుల అమ్మకం అనే కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు ఎన్డిఏ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కిరాణా మర్చెంట్ నిర్వాహకులు పేదలకు అతితక్కువ ధరకే సరుకులను పంపిణీచేయాలన్నారు. కందిపప్పు రూ.160, సోనామసూరు బియ్యం కేజీ రూ.49లకే అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, తహశీల్దార్ రమేశ్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, కూటమి నాయకులు సాకే ఓబులేశ్, జింకా చంద్రశేఖర్, డోల రాజారెడ్డి, గుండా పుల్లయ్య, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** గత వైసిపి ప్రభుత్వ హయాంలో ధరాఘాతం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. గురువారం కదిరి పట్టణంలోని రాయచోటి రోడ్డు నందు రైతు బజార్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కందికుంట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజలకు నిత్యవసర వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ , తహశీల్దార్ పుల్లారెడ్డి, కౌన్సిలర్ రంగా రెడ్డి, బహువుద్దీన్, మహిళా నాయకురాలు పర్వీన్ భాను, రైస్ మిల్లర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రం పరిశీలన

**ప్రజాశక్తి- బత్తలపల్లి**

ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న భవిత కేంద్రాలను సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర అధికారులు పరిశీలించారు. గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని భవిత కేంద్రానికి సమగ్ర శిక్ష ఐఇ కోఆర్డినేటర్ ఆనందబాబు, రాష్ట్ర సమగ్ర శిక్ష అబ్జర్వర్లు దండేపాల్, రామ్ కమల్, మనోజ్ తదితరులు బత్తలపల్లి భవితా సెంటరును పరిశీలించారు. పిల్లలకు సంబంధించిన రికార్డులను, సెంటరు మెంటనెన్సు, రికార్డులను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రత్యేక అవసరాల పిల్లలకు మంజూరైన స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో మండల విద్యాధికారి సుధాకర నాయక్, ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, సిఆర్‌పిలు సునీత, వెంకటరమణ, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**గాండ్లపెంట :** మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం వైస్ ఎంపిపి గంగోజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు మండలంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఎంపీటీసీలు జి సోమశేఖర్ రెడ్డి, వై జయ రామకృష్ణారెడ్డి, సర్పంచులు సిఎస్ఎ. సుధాకర్, ఎస్ శివప్ప నాయుడు వారివారి గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రామానాయక్, డిటి బి. రవి, ఎంఇఒ బి. కృష్ణానాయక్, పశువైద్యాధికారి చెన్నకేశవ నాయక్, ఏవో లక్ష్మీ ప్రియ, ఆర్‌డబ్ల్యూఎస్ కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## కమతం కాటమయ్య రాజీనామా

**బత్తలపల్లి :** తాను పార్టీకి రాజీనామా చేసినట్లు సిపిఐ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బత్తలపల్లి మండలం యర్రాయపల్లి గ్రామానికి చెందిన కమతం కాటమయ్య సిపిఐలో చురుకుగా పనిచేశారు. తన వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నానని రాజీనామా లేఖను జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌కు సోషల్ మీడియా ద్వారా పంపానని కాటమయ్య తెలిపారు.





## ప్రతిభా విద్యార్థులకు బహుమతులు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మండల పరిధిలోని చల్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023 – 24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి భాస్కర్ రెడ్డి గురువారం నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలలో 583 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని సాజియాకు రూ.10వేలు, 542 మార్కులతో రెండవ స్థానంలో నిలిచిన హేమశ్రీకి రూ.5వేలు, 539 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన చరణ్‌కు రూ.2500లు అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు 500 మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున అందజేశారు. గణిత ఉపాధ్యాయుడు ఓబులేసు వందశాతం ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున అందజేశారు. ప్రస్తుత సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 20వేల రూపాయలు అందిస్తానని భాస్కర్ రెడ్డి సందర్భంగా హామీ ఇచ్చారు. విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కషి చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి భాస్కర్ రెడ్డికి ఉపాధ్యాయులు ప్రజలు విద్యార్థులు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జీవో 117ను రద్దు చేయాలి

**ప్రజాశక్తి గాండ్లపెంట**

జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు తాహెర అలీ, మల్లికార్జున ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు గురువారం స్థానికఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన జీవో నెంబర్ 117 వెంటనే రద్దు చేయాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, చిన్నప్పయ్య, గంగాధర్, నరేంద్ర ప్రసాద్, శంకర్ నారాయణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## పంటలసాగుపై అవగాహన

**హిందూపురం :** రూరల్ మండలం పూలకుంట రైతు సేవా కేంద్రంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు, రైతు సేవ కేంద్రం సిబ్బందికి పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ రిసోర్స్ సెంటర్ ఎడిఎ సనావుల్లా, వ్యవసాయ అధికారులు శశిధర్ రెడ్డి, సురేంద్రనాయక్, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఐ నాయకులు అన్నారు. బత్తలపల్లిలోని నిడిమామిడి దేవస్థానానికి సంబంధించిన 401 సర్వే నెంబర్లో దాదాపు 20 ఎకరాల భూమిలో సిపిఐ నాయకులు గురువారం భూఆక్రమణకు దిగారు. ఇతరుల ఆక్రమణలో ఉన్న ఈ భూమిని ఆక్రమించి ఇంటి స్థలాలు లేనివారికి పంపిణీ చేస్తామని సిపిఐ ప్రకటించడంతో మండల వ్యాప్తంగా ఉన్న వందలాది మంది వచ్చి దేవుని మాన్యంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా,మండల నేతల సమక్షంలో జెండాలు పాతి ఆక్రమణకు పాల్పడ్డారు.ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటిమయ్య, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు లక్షలాది మందికి నివేశ స్థలాలు ఇచ్చామని ప్రకటిస్తున్నారే గాని నేటికీ నివేశ స్థలాలు లేని వారు వేలాదిమంది ఉన్నారన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే నిడిమామిడి దేవాదాయ భూమిని వైసిపి హయాంలో మాజీ ఎమ్మెల్యే అనుయాయిలు కాజేయాలని చూశారని విమర్శించారు. అధికారులను మభ్యపెట్టి నకిలీ డాక్యుమెంట్లతో మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఒకవైపు, అనుభవములో ఉన్నాం కాబట్టి తమకే దక్కుతుందని మరో వర్గం ఈ భూమిపై కన్నేసి కాజేయాలని చూశారన్నారు. నిడిమామిడి పీఠాధిపతిని సంప్రదించగా తమ దేవస్థానానికి సంబంధించిన భూములను క్రయ విక్రయాలు జరుపలేదన్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందన లేకపోవడంతో తామే భూ ఆక్రమణకు పాల్పడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నిడిమామిడి దేవాదాయ భూమి పేదలకు దక్కేంతవరకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చేనేత సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి, బత్తలపల్లి ముదిగుబ్బ మండల సిపిఐ కార్యదర్శులు బండల వెంకటేష్, శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాల్యవంతం కుల్లాయప్ప, పోట్లమర్రి నాగభూషణ, వందలాదిమంది నివేశ స్థలాలు లేని బాధితులు పాల్గొన్నారు.

## షాపింగ్ మాల్‌ను మూసివేయాలని వినతి

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**

ధర్మవరంలో గత ఏడాది ఏర్పాటుచేసిన మాంగల్యషాపింగ్ మాల్ వల్ల తాము నష్టపోతున్నామని ఆ మాల్‌ను వెంటనే మూసివేయించాలని వస్త్ర వ్యాపారులు మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు విన్నవించారు. ఈ మేరకు వారు మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మాంగల్యషాపింగ్ మాల్ ఏర్పాటుచేయడం వల్ల తమ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. చివరికి షాపులో పనిచేసే వారికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చిందన్నారు. మాంగల్యషాపింగ్ మాల్‌ను వెంటం మూసివేయించాలని మంత్రిని వ్యాపారులు కోరారు. ఈ విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అంతకు మునుపు వస్త్రవ్యాపారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## మంత్రిని కలిసిన అదనపు ఎస్పీ

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎఎస్‌పి

చేనేత జౌళి, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి సవితను శ్రీ సత్య సాయి జిల్లా అదనపు ఎస్పీ ఎన్. విష్ణు గురువారం కలిశారు. గురువారం పెనుగొండలో మంత్రి నివాసంలో అదనపు ఎస్పీ విష్ణు మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల అనంతరం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, శాంతిభద్రతలపై చర్చించారు.

## మంత్రులకు ఘన స్వాగతం

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో జరిగే సమీక్ష సమావేశానికి రాష్ట్ర మంత్రులు సవిత, సత్య కుమార్ యాదవ్ గురువారం కొత్తచెరువుకు విచ్చేశారు. దీంతో వారికి కూటమి నాయకులు, కురుబ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు హరినాథ్ చౌదరి, శివప్రసాద్, జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు మల్లికార్జున, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు రమేష్, అంగడి ప్రభాకర్, చెన్నప్ప, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాశక్తి - మడకశిర**

పట్టణంలో గురువారం 73వ ఏపీపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక డిపో వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పలిశెట్టి దామోదర్ రావు, రాష్ట్ర అధ్యక్షులు జీవి నరసయ్య, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు కేటి ఆర్ స్వామి, నూరుల్లా, యూనియన్ సభ్యులు గోపాల్, ట్రెజరర్ శివకుమార్, ప్రచార కార్యదర్శి రవి, టిజెపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక డిపో పరిధిలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నబి రసూల్, రీజినల్ కార్యదర్శి జి పద్మనాభ రావు, రీజినల్ సివిపి ఆర్ఎస్. రెడ్డి, డిపో అధ్యక్షులు కాలసముద్రం దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** ధర్మవరం డిపో ఆవరణంలో 73వ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావదినోత్సవాన్ని నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణంలో కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగార్జునరెడ్డి, మస్తాఫా, రీజనల్ జాయింట్ సెక్రటరీ బీ.నరసింహులు, రీజనల్ నాయకులు ఆదినారాయణ, దూలెప్ప, గ్యారేజ్ కార్యదర్శి మల్లికార్జున, పెద్దక్క, ఏడీసీ నరసింహులు, నాయకులు చింతారామకృష్ణ, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జనాభా నియంత్రణ అవసరం

## మంత్రి సత్య కుమార్ యాదవ్

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

జనాభా పెరుగుదల పై అవగాహన అవసరమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని మంత్రి సత్య కుమార్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు.రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ .మంజువాణితో పాటు పలువురు డాక్టర్లు నర్సింగ్ ఉద్యోగ సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న జనాభా ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించేందుకు అలాగే జనాభా నియంత్రణపై అవగాహన కలిగించేందుకు ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్వియ సాల్మన్, జిల్లా అంధత్వ నివారణ శాఖ అధికారి డాక్టర్ అనురాధ, డిఎల్‌డిఒ డాక్టర్ తిప్పయ్య, డిఐఒ డాక్టర్ నాగేంద్ర నాయక్, డిపిఎంఒ డాక్టర్ కెసికె. నాయక్, డిపిహెచ్ఒ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రులు, అధికారులు

## నేరాలు ఘోరాలు

## ఆక్రమణల తొలగింపు పనులు అడ్డగింత

### ఘర్షణ ... గ్రామకార్యదర్శికి గాయాలు

**ప్రజాశక్తి రొద్దం**

మండలంలోని కంబాలపల్లి పంచాయతీలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కొందరు అడ్డగించారు. ఈసందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణలో గ్రామకార్యదర్శికి గాయాలు అయ్యాయి. అందుకు సంబంధించిన వివరాలు... పారిశుధ్య పనుల్లో భాగంగా మండలంలోని కంబాలపల్లి పంచాయతీలోని కంబాలపల్లి, శ్యాంపురం గ్రామాల మధ్య ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, మట్టిని తొలగించే పనులు గత మూడు రోజుల నుంచి కంబాలపల్లి సర్పంచి మంజు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం బీదానపల్లిలో రోడ్డుకు ఇరువైపులా మట్టి, చెట్లు తొలగించే పనులు సర్పంచి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు పక్కన ఉన్న ఎరువుదిబ్బలను తొలగించుకోవాలని కార్యదర్శి 20రోజుల క్రితమే నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవటంతో గురువారం పంచాయితీ కార్యదర్శి ఆధ్వర్యంలో జెసిబి సాయంతో దిబ్బలను తొలగించేపనులు చేపట్టారు. గ్రామ చివరన ఉన్న నరేష్ అనే వ్యక్తి ఇంటివద్ద ఉన్న ఎరువు దిబ్బను తొలిగించే క్రమంలో నరేష్ పంచాయతీ సిబ్బందిపై దుర్భాషలాడాడు. దీంతో కార్యదర్శి విషయాన్ని సర్పంచి మంజుకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో సర్పంచి ఘటనాస్థలానికి వచ్చి జరిగిన ఘటనపై ఆరా తీశాడు. ఈ సమయంలో నరేష్, అతని కుటుంబసభ్యులు సర్పంచి, పంచాయతీ సిబ్బందిపై దాడికి దిగారు. ఈసందర్భంగా వారు రాళ్లతో దాడి చేయడంతో కార్యదర్శి చేతికి బలమైన గాయమైంది. పరిస్థితి విషమించడంతో కార్యదర్శి పోలీసులకు సమాచారమిచ్చాడు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. తమపై జరిగిన దాడి విషయంలో గ్రామ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరేష్, ఆయన భార్య, తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


జేసీబీతో చెత్త దిబ్బను తొలగిస్తున్న దృశ్యం

## పట్టపగలే ఇంట్లో చోరీ

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండలంలోని సంజీవరాయినిపల్లికి చెందిన టీ స్టాల్ నాగరాజు ఇంట్లో గురువారం చోరీ జరిగింది. ఈ విషయంపై బాధితుడు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. నాగరాజు చిలమత్తూరులో టీ స్టాల్ పెట్టుకొని జీవనం చేస్తున్నాడు. ఎప్పటి లాగే ఉదయం ఇంటికి తాళం వేసి నాగరాజు దంపతులు ఇద్దరు చిలమత్తూరు టీ కొట్టుకు వచ్చారు. తిరిగి మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లె సరికి తాళం తెరిచి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా సంఘానికి కట్టే డబ్బులు రూ.20 వేలతో పాటు 6 గ్రాముల ఉంగరం చోరీకి గురైందని గమనించాడు. దీంతో బాధితులు చిలమత్తూరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు.పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ మోహన్ నాయక్ తెలిపారు.మంగళవారం రోజు మరవకొత్తపల్లి బీసి కాలనీలో పట్టపగలు దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. ఇలా రెండురోజుల్లో రెండుచోట్ల పట్టపగలే చోరీలు జరగడంపై మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

**ప్రజాశక్తి బత్తలపల్లి**

బత్తలపల్లిలోని పలు ఎరువుల దుకాణాలలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.బత్తలపల్లి లోని హనుమాన్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో ఫిజికల్ స్టాక్,స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాన్ని గమనించి నోటీసు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారి ఉపేంద్రరెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తాడిమర్రి మండలంలోనిశ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ తనిఖీ చేశారు. ఎవరైనా ఎరువులను అక్రమ నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రమాదేవి ఎంపీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**

మండలంలోని రావులచెరువు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త మారుతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డిని బాధితులు జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్‌రెడ్డి మృతుని భార్య అశ్వినికి జనసేన పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

## సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి- పుట్టపర్తి రూరల్**

తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు మంత్రులను కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం పుట్టపర్తి లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర చేనేత జౌళి, బి సి సంక్షేమ శాఖా మంత్రి సవిత, పుట్టపర్తి శాసన సభ్యులు సింధూర రెడ్డిని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జెఎసి జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి , ఓబులేసు , రవి, భాస్కర్, శ్రీరాములు, పోతలయ్య, ముకుంద రెడ్డి, రామమోహన్ , శంకరప్ప , వజ్ర నాయక్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి నిరుపేద విద్యార్థులు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మండల పరిధిలోని చల్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో మంచి మార్కులు సంపాదించిన విద్యార్థిని షాజియా ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి తెలిపారు. పదో తరగతిలో 582 మార్కులు సంపాదించి సాజియా పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. తమ కూతురు ట్రిపుల్ ఐటికి ఎంపిక కావటం పట్ల ఆమె తల్లిదండ్రులు మాగచెరువు గ్రామానికి చెందిన ఇమామ్‌బీ, షాజియా తండ్రి ఇమామ్ హర్షం వ్యక్తం చేశారు.

**పెనుకొండ టౌన్ :** పెనుకొండకు చెందిన విద్యార్థి దివ్య బాయి ట్రిబుల్ ఐటీ కి ఎంపికయింది. పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీలో నివాసం ఉంటున్న గంగాధర్ నాయక్, నాగమణి ల కుమార్తె దివ్యబాయి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంది. పదవ తరగతిలో 562 మార్కులు సాధించింది. విద్యార్థి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తమ కూతురు ఇడుపులపాయలోని ట్రిబుల్ ఐటీ సీటు సాధించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

**చిలమత్తూరు :** మండల పరిదిలోని కోడూరు గ్రామానికి చెందిన ఎం వెంకటేష్,ఎం అనూషాల కుమార్తె జస్మిత ట్రిపుల్ ఐటిలో సీటు సాధించింది. బార్బర్ కూతురైన జస్మిత కోడూరు జెడ్పీ హై స్కూల్ లో పదవతరగతిలో 569 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కాగా ఇడుపలపాయలోని ట్రిపల్ ఐటికి ఎంపిక అయింది. అలాగే దిగువపల్లికి చెందిన ఎస్ఎస్ వైవీఎన్ విద్యార్థులు గౌతమ్ నాయక్, మండల కేంద్రానికి చెందిన ధనుష్ ట్రిపుల్ ఐటికి ఎంపిక అయ్యారని ఆ పాఠశాల నిర్వహకులు భాస్కర్ రెడ్డి తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే తిమ్మారెడ్డికి నివాళి

**ప్రజాశక్తి మడకశిర**

పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరంలో గురువారం వై తిమ్మారెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బెంగళూరు రోటరీ క్లబ్ వారు అందజేసిన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్. గోపాలకృష్ణ, పాఠశాల కార్యదర్శి హనుమంతరెడ్డి, పాఠశాల సమితి అధ్యక్షులు సిఎ బద్రీనాథ్, ప్రాథమిక పాఠశాల పూర్వ కార్యదర్శి పురుషోత్తం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

**మడకశిర రూరల్ :** మడకశిర మాజీ శాసనసభ్యులు వైవి తిమ్మారెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు తిమ్మారెడ్డికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర పట్టణంలోని శాంతమ్మ వై తిమ్మారెడ్డి డిగ్రీ కళాశాల మంజూరుకు కావలసిన మొత్తం ఫీజును వైవి తిమ్మారెడ్డి చెల్లించినట్లు తెలిపారు. అలాగే పట్టణంలో మసీదుకు , పాఠశాలలకు, వసతిగృహం, కళామందిర్ తదితర వాటిని స్థలాలను విరాళంగా ఇచ్చారన్నారు.